# ట్రూ న్యూస్
## తెలుగు దిన పత్రిక

| Telangana Hyderabad | Volume:01 Issue: 172 | Friday AUG - 28 2026 | page's: 6 | Rs:4/- |
|---|---|---|---|---|
| తెలంగాణ హైదరాబాద్ | సంపుటి:01 సంచిక: 172 | శుక్రవారం 28-08-2026 | పేజీలు : 6 | వెల.రూ. 4.00 |


# భూకంపం కాదు.. హిమనీ సరస్సు బద్దలవడం వల్లే!

**నేపాల్ వరదంపై అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడి**



- లిండే నది ఉప్పొంగి భోటే కోషి నదిలోకి ఒక్కసారిగా వరద దూసుకొచ్చింది.
- భూకంపం కారణంగా కాదు.. కొండచరియలు విరిగిపడటం వల్లే ప్రకంపనలు సంభవించాయి.
- పర్వతాల నుంచి భారీ స్థాయిలో మంచు, రాళ్ల చర్యలు విరిగిపడుతున్నట్లు శాటిలైట్ దృశ్యాలు.

“అది భూకంపం కాదు.. హిమానీ సరస్సు బద్దలై, భారీ మంచు చర్యలు, రాళ్లు విరిగి పడటంతో లిండే నది ఉప్పొంగి.. భోటే కోషి నదిలోకి వరద దూసుకొచ్చింది.” -- అమెరికా జియోలాజికల్ సర్వే




**వరద బీభత్సం.. సంఖ్యలు**

మరణాలు: 157 మంది
గల్లంతైన వారు: వందల సంఖ్యలో
భారతీయులు గల్లంతు: 140o
టిబెట్‌లో మృతి: 3 మంది
టిబెట్‌లో గల్లంతు: 553o

# రక్షాబంధన్
## ఈసారి ప్రత్యేకం..

**లక్ష చెట్లకు రాఖీలు కట్టనున్న గ్రామస్థులు..!**



తోబుట్టువుల చేతికి రాఖీ కట్టడం చూశాం.. మరి చెట్లకు రాఖీ కట్టడం ఎప్పుడైనా చూశారా? ఝార్ఖండ్‌లో ఈసారి రక్షాబంధన్‌కు ఇదే ప్రత్యేకత. అడవులను కాపాడటమే లక్ష్యంగా వేల మంది గ్రామస్థులు శుక్రవారం సుమారు లక్ష చెట్లకు రాఖీలు కట్టేందుకు సిద్ధమయ్యారు. 'సేవ్ ట్రీ' ప్రచారంలో భాగంగా రాష్ట్రంలోని 700 గ్రామాల్లోని ప్రజలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకోనున్నట్లు అధికారులు తెలిపారు. చెట్టుకు రాఖీ కట్టిన ప్రతి ఒక్కరూ దాన్ని కాపాడతామని ప్రతిజ్ఞ చేయనున్నారు. నెల రోజులపాటు సాగే ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని 24 జిల్లాల్లో 3 లక్షల చెట్లకు రాఖీలు కట్టాలని అటవీశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. గుమ్లా జిల్లా జోరాడ్‌లో అటవీశాఖ అధికారి సంజీవ్ కుమార్ చెట్టుకు రాఖీ కట్టి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఆయన ఆలోచనతోనే 2004లో ధన్‌బాద్ జిల్లాలో ఈ వినూత్న కార్యక్రమం మొదలైంది. ఈ ఆలోచన క్రమంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. ఇప్పటివరకు 12 వేలకు పైగా గ్రామాలు ఈ కార్యక్రమంతో మమేకమయ్యాయి.

# రాజధానికి మరో ప్రతిష్ఠాత్మక సంస్థ..

**అమరావతిలో NIELIT క్యాంపస్**



అమరావతి, ఆగస్టు 27: రాజధాని అమరావతిలో మరో జాతీయ విద్య సంస్థను కేంద్రం ఏర్పాటు చేయనుంది. దేశంలోనే తొలి క్వాంటమ్ - ఏఐ యూనివర్శిటీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ని రూ.730 కోట్లతో ఏర్పాటు కానుంది. అమరావతిలో NIELIT క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. అందుకోసం 8.5 ఎకరాల్లో కేటాయించింది. అయితే సెప్టెంబర్ 13వ తేదీ నుంచి ఆంధ్రా యూనివర్శిటీలో NIELIT తరగతులు ప్రారంభం కానున్నాయి. NIELIT కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిధిలో ఉంటుంది. ఈ నిధులను కేంద్ర ప్రభుత్వం 100 శాతం గ్రాంట్-ఇన్-ఎయిడ్ ఫండ్‌లో సమకూర్చనుంది.

# రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి రాఖీ శుభాకాంక్షలు

- రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు: సీఎం రేవంత్‌రెడ్డి
- మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తాం
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
- మహిళల కోసం ప్రభుత్వ పథకాల అమలు
- సహోదరత్వమే గొప్ప బంధం: కేసీఆర్
- అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధం అజరామరం
- రాఖీ బంధన్ ప్రత్యేక కుటుంబ వేడుక
- సౌభ్రాతృత్వంతోనే వసుదైక కుటుంబ భావన

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో ప్రభుత్వం పథకాలు అమలుచేస్తోందని సీఎం వెల్లడించారు.
రాఖీ నేపథ్యంలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మానవ సంబంధాలలో సహోదరత్వం అత్యంత గొప్ప బంధం అని పేర్కొన్నారు. అక్కా తమ్ముళ్లు, అన్నా చెల్లెళ్ల అనుబంధం అజరామరం అని తెలిపారు. రాఖీ బంధన్ భారత కుటుంబ జీవనంలో ప్రత్యేక సంప్రదాయ వేడుక అని చెప్పారు. ప్రజలంతా సౌభ్రాతృత్వంతో జీవించడంతోనే వసుదైక కుటుంబ భావన పరిఢవిల్లుతుందన్నారు.



# జెన్‌జీ ఉద్యమాలపై కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఒక నీతి..

**తెలంగాణలో మరో నీతి: హరీశ్‌రావు**



- పాలిటెక్నిక్ విద్యార్థులపై ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోంది
- 97 జీవోను రద్దు చేయాలి: హరీశ్‌రావు
- విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్
- తెలంగాణ విద్యార్థుల ఉద్యమాలు రాహుల్ గాంధీకి కనిపించడం లేదా?
- కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి
- హనుమకొండలో టీఎస్జీవోల ధర్నాకు మద్దతు
- ధర్నా నేపథ్యంలో హరీశ్‌రావు అరెస్ట్
- సుబేదారి పీఎస్‌కు తరలింపు.. అనంతరం విడుదల

2లో

# జగన్‌కు రైతులు, బీసీలపై చిత్తశుద్ధి లేదు




సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థసారథి
బెంగళూరులో సేదతీరిన జగన్‌కు ఇప్పుడే ఎల్ నినో గుర్తొచ్చిందా
నాడు బీసీ రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టులో ఎందుకు పోరాడలేదు
రాయలసీమ ప్రాజెక్టులకు జగన్ ఖర్చు చేసింది కేవలం రెండు వేల కోట్లే

# ఓయూకు రూ.వెయ్యి కోట్లు ఇస్తానని..

**ఒక్క రూపాయి ఇవ్వలేదు: రామచందర్‌రావు**




- ఓయూకు రూ.1,000 కోట్లు ఇస్తామన్నారు
- ఏడాది గడిచినా రూపాయి ఇవ్వలేదు
- టీచర్ల జీతాలకు డబ్బులు లేవన్న సీఎం
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.15 వేల కోట్లు
- యంగ్ ఇండియా స్కూళ్లపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- పాలిటెక్నిక్ కాలేజీల రద్దును వ్యతిరేకిస్తున్నాం
- విద్యార్థుల ఉద్యమానికి నైతిక మద్దతు
- విద్యార్థులను రాజకీయంగా వాడుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నాం

# తుమ్మిడిహట్టి బ్యారేజీ అంశం.. రెండు రాష్ట్రాలతో సమావేశం ఏర్పాటు




హైదరాబాద్: ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి బ్యారేజీ అంశంపై కేంద్రం ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేసింది. సెప్టెంబర్ 1న కేంద్ర జల సంఘం ఛైర్మన్ అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. తెలంగాణ, మహారాష్ట్ర అధికారులు, కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తితో ఈ సమావేశం ఏర్పాటు చేయడానికి కేంద్రం ముందుకొచ్చింది.

# రాయలసీమ కరువుతో జగన్ రాజకీయం

- ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు
- రాయలసీమ కరువును రాజకీయాలకు వాడుకుంటున్న వైసిపి
- ఐదేళ్లలో రాయలసీమకు జగన్ ఖర్చు చేసింది రూ. 2 వేల కోట్లే
- జీవో 365తో సీమలోని 102 ప్రాజెక్టులను రద్దు చేసిన గత ప్రభుత్వం
- హంద్రీనీవాకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత



2లో

# సంపాదకీయం

## సంక్షేమానికి నిజంగానే ఎక్కువ ఖర్చు చేస్తున్నామా?



ఒకే దేశం, ఒకే జనాభా. కానీ ఏ కొలబద్దతో చూస్తామన్నదాన్ని బట్టి దేశంలో 'పేదలు' 5.3శాతమూ కావచ్చు, 82.1శాతమూ కావచ్చు. ఈ వైరుధ్యం సంక్షేమం అవసరంపై చర్చను మరోసారి ముందుకు తెస్తోంది. ముఖ్యంగా, జాతీయ ఆహార భద్రతా చట్టానికి కేంద్ర ప్రభుత్వం 2026 జూన్‌లో ముసా యిదా సవరణ బిల్లును విడుదల చేసిన నేపథ్యంలో ఈ ప్రశ్న మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సవరణలు మంచివా కావా అనే విషయాన్ని పక్కన పెడితే, ఈ చర్చలో తరచూ వినిపిస్తున్న ప్రశ్న ఒకటుంది: 'ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ ఎదుగుతున్నవేళ, దాదాపు 80 కోట్ల మందికి ఉచితంగా ఆహార ధాన్యాలు ఇవ్వడం ఇంకా అవసరమా?'

ఈ ప్రశ్నకు ప్రధానంగా రెండు రకాల స్పందనలు వినిపిస్తాయి: ఇంత భారీ స్థాయిలో ఉచిత రేషన్ ఇవ్వడం ప్రజలను స్వయం సమృద్ధి వైపు నడిపించకుండా సంక్షేమంపై ఆధారపడేలా చేస్తోందనేది ఒక వాదన. మరోవైపు, దేశం నిజంగా అంతగా అభివృద్ధి చెందితే ఇన్ని కోట్ల మందికి ఉచిత ఆహారం ఎందుకు అవసరమవుతోందని ప్రశ్నిస్తూ, ఆర్థికవృద్ధి కథనాన్నే అనుమానించేది మరో వాదన. కానీ ఈ రెండు వాదనలూ ఒక ముఖ్యమైన విషయాన్ని మర్చిపోతున్నాయి: తీవ్రమైన పేదరికం నుంచి బయటపడటం, ఆర్థిక భద్రత సాధించడం ఒకటే కాదు. అందువల్ల ఆర్థిక వ్యవస్థ పెరుగుతూ, పేదరికం తగ్గుతున్నప్పటికీ సంక్షేమం అవసరం తప్పనిసరిగా తగ్గిపోదు.

గత రెండు దశాబ్దాల్లో భారత ఆర్థిక వ్యవస్థ గణనీయంగా పెరిగిందన్నది వాస్తవం. అదే సమయంలో పేదరికం కూడా భారీగా తగ్గింది. ప్రపంచ బ్యాంకు 2025 జూన్‌లో విడుదల చేసిన అంచనాల ప్రకారం, రోజుకు 3 డాలర్ల పేదరిక రేఖను ప్రమాణంగా తీసుకుంటే, 2011--12లో 27.1శాతంగా ఉన్న 'తీవ్రమైన పేదరికం' 2022--23 నాటికి 5.3శాతానికి తగ్గింది. కానీ కథ అక్కడితో పూర్తికాదు. పేదరికం తగ్గడం వేరు, ఆర్థిక భద్రత వేరు.

పేదరికాన్ని కొలిచేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఒకే ప్రమాణాన్ని ప్రపంచ బ్యాంకు ఉపయోగించదు. దిగువ--మధ్య ఆదాయ దేశాలకు పేదరిక ప్రమాణంగా నిర్ణయించిన 'రోజుకు 4.20డాలర్ల' లెక్కనే తీసుకుంటే, 2022--23లో భారత జనాభాలో 23.9శాతం మంది ఆ రేఖకు దిగువన ఉన్నారు. ఎగువ--మధ్య ఆదాయ దేశాలకు ఉపయోగించే 8.30 డాలర్ల ప్రమాణాన్ని తీసుకుంటే ఈ సంఖ్య ఏకంగా 82.1శాతానికి చేరుతుంది.

పేదరికానికి సంబంధించి 5.3శాతం, 23.9శాతం, 82.1శాతం అనే మూడు సంఖ్యలు ఒక కీలక వాస్తవాన్ని బయటపెడతాయి: ఏ ప్రమాణంతో కొలుస్తామన్నదాన్ని బట్టి 'పేద' అనే నిర్వచనం, ఆ పరిధిలోకి వచ్చే జనాభా -- రెండూ పూర్తిగా మారిపోతాయి. తీవ్ర పేదరిక రేఖను దాటినంత మాత్రాన కోట్లాది మంది ఆర్థిక అభద్రత నుంచి బయటపడినట్లు కాదు.

ప్రముఖ రాజకీయ ఆర్థికవేత్త, భారతీయ వ్యవహారాలపై నిపుణుడు ప్రొఫెసర్ డియెగో మయోరానో కూడా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తారు. తీవ్ర పేదరికం నుంచి బయటపడినప్పటికీ, భారత జనాభాలో పెద్ద భాగం పేదరికానికి కొద్దిగా ఎగువన మాత్రమే జీవిస్తోందని; అనారోగ్యం, పంట నష్టం లేదా ఆదాయంలో అకస్మాత్తుగా వచ్చే దెబ్బలు వారిని మళ్లీ పేదరికంలోకి నెట్టగలవని ఆయన ఒక పరిశోధనా పత్రంలో పేర్కొన్నారు.

ఒక కుటుంబం అధికారికంగా దారిద్ర్య రేఖకు పైన ఉండవచ్చు. ఇంట్లో మోటార్ సైకిల్, స్మార్ట్ ఫోన్ ఉండవచ్చు. పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపుతుండవచ్చు. బయటకు చూస్తే అది మధ్యతరగతి కుటుంబంలా కనిపించవచ్చు. కానీ ఆ కుటుంబంలో తీవ్రమైన అనారోగ్యం, ఉద్యోగం పోవటం లేదా పంట నష్టం సంభవిస్తే? ఒక్క సంఘటనే చిన్న పొదుపును తుడిచిపెట్టి, అప్పుల్లోకి నెట్టి, ఉన్న కొద్దిపాటి ఆస్తులు అమ్ముకునేలా చేసి, ఆ కుటుంబాన్ని మళ్లీ పేదరికంలోకి తోసేయవచ్చు. అందుకే పేదరికం తగ్గడం వేరు; ఆర్థిక భద్రత సాధించడం వేరు.

ఈ ఆర్థిక అస్థిరత ఎంతమాత్రం ఊహాజనితం కాదు. 'ఇండియా హ్యూమన్ డెవలప్‌మెంట్ సర్వే' డేటాను ప్రపంచ బ్యాంకు విశ్లేషిస్తే ఒక విషయం స్పష్టమైంది-- 2005 నుంచి 2012 మధ్య 27శాతం కుటుంబాలు పేదరికం నుంచి బయటపడగా, 7శాతం కుటుంబాలు తిరిగి పేదరికంలోకి జారిపోయాయి. ఈ కోణంలోనే 80 కోట్ల ఉచిత రేషన్ లబ్ధిదారుల సంఖ్యను కూడా చూడాలి. నిజానికి ఇది ప్రస్తుత పేదరికానికి సంబంధించిన ప్రత్యక్ష అంచనా కాదు. జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం గ్రామీణ జనాభాలో 75శాతం, పట్టణ జనాభాలో 50శాతం వరకు కవరేజ్ కల్పించాలన్న నిబంధనను బట్టి, 2011 జనాభా లెక్కల ఆధారంగా ఉచిత రేషన్ లబ్ధిదారుల సంఖ్య దాదాపు 81కోట్లుగా ఉంది. కాబట్టి వీరందరినీ అత్యంత పేదలుగా చూడటం కంటే, వారిలో ఎంతమంది ఆహార భద్రత వంటి రక్షణలు లేకుండా ఒక అనారోగ్యం, ఉద్యోగ నష్టం లేదా ఆదాయపు దెబ్బను తట్టుకోగలరన్నదే అడగాల్సిన అసలు ప్రశ్న.

ఇన్ని సంవత్సరాలుగా సంక్షేమ పథకాలు అమలవుతున్నప్పటికీ ఈ అభద్రత ఇంకా ఉంటే సంక్షేమం విఫలమైందనుకోవాలా? అలా తేల్చడం తొందరపాటు. సంక్షేమం ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా భద్రమైన స్థితికి తీసుకెళ్లే ఏకైక సాధనం కాదు. ఆహార భద్రత, ఉపాధి హామీ, పింఛన్లు వంటి పథకాలు ఆర్థిక దెబ్బ వచ్చినప్పుడు కుటుంబం పూర్తిగా కిందపడిపోకుండా కనీస రక్షణను కల్పిస్తాయి. మనం గమనించాల్సింది-- ఇవి లేకపోతే ఆ కుటుంబాలు ఎంత త్వరగా అప్పుల్లోకి, ఆకలిలోకి జారిపోతాయన్నది. అందువల్ల ఒక సంక్షేమ పథకం విజయాన్ని 'లబ్ధిదారుడు ఇంకా ఆర్థిక అభద్రతలోనే ఉన్నాడా?' అనే ఒక్క ప్రశ్నతో కొలవలేం. 'ఆ పథకం లేకపోతే వారి పరిస్థితి ఎంత అధ్వానంగా ఉండేది?' అన్న ప్రశ్న కూడా అడగాలి.

దీర్ఘకాలిక ఆర్థిక భద్రతకు స్థిరమైన ఉపాధి, తగిన ఆదాయం, అందుబాటులో వైద్యం, విద్య వంటి అంశాలు అవసరమే. సంక్షేమం వాటికి పూర్తి స్థాయి ప్రత్యామ్నాయం కాదు. కానీ ఆ స్థాయి భద్రత అందరికీ అందేంతవరకు, సామాజిక రక్షణ ఒక కీలకమైన ఆధారంగా ఉంటుంది.

మరి సంక్షేమంపై మనం నిజంగానే అధికంగా ఖర్చు చేస్తున్నామా? సంక్షేమ పథకాల పరిధి విస్తృతంగా ఉండటం వల్ల, దేశ సంపదలో అసాధారణంగా పెద్ద భాగాన్ని వాటికే ఖర్చు చేస్తున్నామనే అభిప్రాయం ఉంది. అయితే ఆర్థికవేత్త రీతికా ఖేరా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పది ప్రధాన సంక్షేమ పథకాలపై గత రెండు దశాబ్దాల వ్యయాన్ని పరిశీలించారు. వారి లెక్కల ప్రకారం, ఒక్క కోవిడ్ సంవత్సరంలో మాత్రమే ఈ పథకాల మొత్తం వ్యయం జీడీపీలో 3శాతాన్ని దాటింది. 2023--24లో జీడీపీలో వీటి వాటా దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఉన్న స్థాయికి పెద్దగా భిన్నంగా లేదు. ఈ పరిశీలన కొన్ని ప్రధాన పథకాలకే పరిమితమైనప్పటికీ ఒక ముఖ్యమైన ప్రశ్నను లేవనెత్తుతుంది: విస్తృత కవరేజ్ ఉన్నంత మాత్రాన మనం నిజంగా అధికంగా ఖర్చు చేస్తున్నట్లా?

కోట్ల మందికి ఒక పథకం చేరుతున్నప్పటికీ, ఒక్కో కుటుంబానికి అందుతున్న సహాయం వారి వాస్తవ అవసరాలతో పోలిస్తే పరిమితంగానే ఉండవచ్చు.

## రాయలసీమ కరువుతో జగన్ రాజకీయం

మొదటిపేజీ తరువాయి

**మంగళగిరి, ఆగష్టు 27 :**

రాయలసీమలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను రాజకీయ ప్రయోజనాలకు జగన్మోహన్ రెడ్డి వాడుకుంటున్నారని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో రాయలసీమ ప్రాజెక్టులకు జగన్ కేవలం రూ. 2,000 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే రూ. 13,500 కోట్లకు పైగా ఖర్చు చేసిందని, ఈ బడ్జెట్‌లో మరో రూ. 10,014 కోట్లు వెచ్చిస్తున్నామని తెలిపారు.

ప్రాజెక్టుల రద్దుతో సీమకు తీరని ద్రోహం

జగన్ ప్రభుత్వం తెచ్చిన జీవో 365 ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రద్దు చేసిన ప్రాజెక్టులలో 102 రాయలసీమకు చెందినవేనని కాలవ శ్రీనివాసులు తెలిపారు. హంద్రీనీవా విస్తరణ, వేదవతి, గుండ్రేవులు వంటి కీలక ప్రాజెక్టులను గత ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం హంద్రీనీవాకు ప్రాధాన్యతనిస్తూ రూ. 5,050 కోట్లకు పైగా నిధులు సమకూరుస్తోందని, మడకశిర బ్రాంచ్ కెనాల్ పనులను పునఃప్రారంభించామని వివరించారు. ఎల్ నినో అనేది ప్రపంచవ్యాప్త సమస్య అని పేర్కొన్నారు.

నీటి నిర్వహణపై తప్పుడు ప్రచారాలు తగవు

రెండు రాష్ట్రాల పత్రికల్లో భిన్న కథనాలు రాయిస్తూ ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు నిబంధనల ప్రకారమే నీటి కేటాయింపులు జరుగుతున్నాయని తెలిపారు. చంద్రబాబు సమర్థ నీటి నిర్వహణ వల్లే నేడు తాగునీటి వెసులుబాటు కలిగిందని, వచ్చే ఏడాది జూలై వరకు సరిపడా నీటిని నిల్వ చేస్తున్నామని తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో రాజకీయాలు మాని ప్రజలకు అండగా ఉండాలని హితవు పలికారు.

## జగన్‌కు రైతులు, బీసీలపై చిత్తశుద్ధి లేదు

మొదటిపేజీ తరువాయి

**మంగళగిరి, ఆగష్టు 27 :**

ప్రజా సమస్యలపై జగన్మోహన్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే మీడియా ముందు కాకుండా అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి డిమాండ్ చేశారు. ఐదేళ్ల పాలనలో కరువు నివారణ చర్యలు చేపట్టని జగన్, ఇప్పుడు ఎల్ నినోపై మాట్లాడుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే ఎల్ నినోను ఎదుర్కొనేందుకు తక్కువ నీటితో పండే పంటలను, పంట బీమాను ప్రోత్సహిస్తోందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, సెప్టెంబర్ 3 నాటికి పోలవరం జలాలను ఉత్తరాంధ్రకు తెస్తున్నామని వివరించారు.

?బీసీలకు జగన్ తీరని ద్రోహం

?అధికారంలో ఉన్నప్పుడు బీసీలను విస్మరించిన జగన్, ఇప్పుడు వారిపై మొసలి కన్నీరు కారుస్తున్నారని మంత్రి మండిపడ్డారు. నామినేటెడ్ కాంట్రాక్టుల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి బీసీలను మోసం చేశారని ఆరోపించారు. కోర్టులు రిజర్వేషన్లను వ్యతిరేకిస్తే సుప్రీంకోర్టుకు వెళ్లి పోరాడలేదని, ఫలితంగా వేలాది మంది బలహీన వర్గాల నాయకులు పదవులకు దూరమయ్యారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ మొదటి నుంచీ బీసీలకు అండగా నిలిచిందని గుర్తుచేశారు.

రాయలసీమ అభివృద్ధి కూటమితోనే సాధ్యం

రాయలసీమ ప్రాజెక్టులకు జగన్ ఐదేళ్లలో కేవలం రూ. 2,000 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే రూ. 13,500 కోట్లు ఖర్చు చేయడమే కాకుండా, మరో రూ. 10,000 కోట్లు వెచ్చించేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. కడప స్టీల్ ప్లాంట్, కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్ల పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. మద్యం కేసుల్లో నిందితులను ఈడీ అరెస్టు చేస్తే, ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడం తగదని తెలిపారు.

## యుద్ధ ట్యాంకులు.. సరిహద్దుల్లో ఉక్కు గోడల్లాంటివి: రాజ్‌నాథ్ సింగ్



యుద్ధ ట్యాంకులు దేశ సరిహద్దుల్లో ఉక్కు గోడల్లాంటివని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. డ్రోన్లు, క్షిపణుల పాత్ర పెరుగుతున్నప్పటికీ.. భూతల దాడుల్లో యుద్ధ ట్యాంకులు కీలకమని తెలిపారు. అవి శత్రువుల పాలిట సింహస్వప్నంలా నిలుస్తాయని, యుద్ధక్షేత్రంలో సైనికుల మనోధైర్యాన్ని పెంచుతాయని చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని 'వెహికల్ ఫ్యాక్టరీ జబల్‌పుర్'లో టీ-సిరీస్ యుద్ధ ట్యాంకుల మరమ్మతుల కోసం రూ.472 కోట్ల వ్యయంతో నిర్మించనున్న కేంద్రానికి శంకుస్థాపన చేసిన అనంతరం రాజ్‌నాథ్ (ఖుఅఫ్ష్ర్ణ ాఱఅస్త్రష్ట) ఈమేరకు ప్రసంగించారు.

"అత్యంత శక్తిమంతమైన సైన్యం కలిగిన దేశాల్లో భారత్ ఒకటి. డ్రోన్లు, క్షిపణులు, ఇతర అధునాతన సాంకేతికతలతో యుద్ధం తీరు వేగంగా మారుతోంది. అంతమాత్రాన ట్యాంకులు ప్రాధాన్యం కోల్పోయాయని కాదు. రణరంగంలో ఒకే వ్యవస్థపై ఆధారపడకుండా.. సమష్టి సామర్థ్యం కలిగి ఉండటం అవసరం. డ్రోన్లు, క్షిపణులు, ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థలతోపాటు ఆధునిక ట్యాంకులూ ముఖ్యమే. భూతల దాడుల్లో టీ-72, టీ-90 ట్యాంకులు ఎంతో కీలకం. దేశ సరిహద్దుల్లో అవి ఉక్కు గోడలా నిలుస్తాయి. కొత్తగా ఏర్పాటు చేయనున్న కేంద్రంలో ఏటా 80 ట్యాంకులకు మరమ్మతులు చేయొచ్చు" అని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

## భూకంపం కాదు.. హిమనీ సరస్సు బద్దలవడం వల్లే: నేపాల్ వరదలపై అమెరికా

మొదటిపేజీ తరువాయి

హిమాలయ దేశం నేపాల్‌లో సంభవించిన మెరుపు వరదలు వందల కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపాయి. భోటే కోషి నది ఉప్పొంగడంతో అనేక జిల్లాలను వరద, బురద కలిసి ముంచెత్తింది. ఈ జలప్రళయానికి మంచుకొండల్లో భూకంపమే కారణమని తొలుత వార్తలు వచ్చాయి. అయితే, హిమనీ సరస్సు బద్దలవడం వల్లే ఈ విపత్తు (చీవజుఖ్రీ ఖీశ్రీశీశం) సంభవించినట్లు తాజాగా అమెరికా జియాలాజికల్ సర్వే తాజాగా వెల్లడించింది.

బుధవారం ఉదయం 8.37 గంటల సమయంలో టిబెట్‌లోని గోసాయిన్‌కుండ ప్రాంతంలో 4.4 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు తొలుత అమెరికా (ఖూూ) అధ్యయన సంస్థ అంచనా వేసింది. దాని ప్రభావంతో టిబెట్, నేపాల్ (చీవజుఖ్రీ) సరిహద్దులోని పర్వత సమూహం నుంచి భారీ కొండ చరియ విరిగిపడినట్లు పేర్కొంది. అయితే, తాజాగా దీనిపై వివరణ ఇచ్చింది.

**పర్వతాలపై నీటి బాంబులు!**

"అది భూకంపం కాదు.. ఈ తరంగాలను దీర్ఘకాలికంగా మేం విశ్లేషించిన అనంతరం కొండచరియలు విరిగిపడటం వల్లే ప్రకంపనలు సంభవించినట్లు తేలింది. హిమనీ సరస్సు బద్దలై భారీ మంచు చరియలు, రాళ్లు పడ్డాయి. దీంతో లిండే నది ఉప్పొంగి.. భోటే కోషి నదిలోకి వరద ఒక్కసారిగా దూసుకొచ్చింది" అని అమెరికా జియాలాజికల్ సర్వే స్పష్టం చేసింది. పర్వత ప్రాంతాల నుంచి భారీ పరిమాణంలో ఉన్న మంచు, రాళ్ల చరియలు విరిగిపడుతున్నట్లు శాటిలైట్ దృశ్యాల ద్వారా తెలిసిందని నిపుణులు పేర్కొన్నారు.

**7 నిమిషాల ముందు ప్రకంపనలు**

మరోవైపు, ఈ వరదలను జర్మన్ రీసర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ విశ్లేషించింది. జల ప్రళయానికి దాదాపు 7 నిమిషాల ముందు 4.4 తీవ్రతతో ప్రకంపనలు సంభవించినట్లు తాము గుర్తించామని తెలిపింది. ఆ వెంటనే భీకర వరద నేపాల్ జిల్లాలను ముంచెత్తినట్లు పేర్కొంది.

ఈ విపత్తులో ఇప్పటివరకు 157 మంది ప్రాణాలు కోల్పోయారు. వందల మంది గల్లంతయ్యారు. వీరిలో అత్యధికులు విదేశీయులే. భారత్ నుంచి 140 మందికి పైగా వరదల్లో కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. అటు టిబెట్ వైపు కూడా వరద తీవ్రత ఎక్కువగానే ఉంది. ఆ దేశంలో ముగ్గురు మరణించగా.. 553 మందికి పైగా గల్లంతయ్యారు.

## ఓయూకు రూ.వెయ్యి కోట్లు ఇస్తానని..

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ)కి రూ.వెయ్యి కోట్లు ఇస్తానని చెప్పి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. హైదరాబాద్ తార్నాకలోని నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిధులు ప్రకటించి ఏడాది గడిచినా.. రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు.

"టీచర్లకు జీతాలు ఇచ్చేందుకు డబ్బులు లేవని స్వయంగా సీఎం అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దారిలోనే.. కాంగ్రెస్ ప్రభుత్వం వెళ్తోంది. విద్యార్థుల విషయంలో మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదని చెప్తూనే ఉన్నాం. పాలిటెక్నిక్ కోర్సు కూడా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సు. పాలిటెక్నిక్ విద్యార్థులు బీటెక్‌లోకి వెళ్లకుండా అడ్డుకోవటం సరికాదు. మీ నిర్ణయం సరైనది అయితే.. మళ్లీ కమిటీ ఎందుకు వేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పెట్టిన ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు రూ.15వేల కోట్లకు చేరాయి. యంగ్ ఇండియా స్కూల్స్ అని గొప్పగా చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవట్లేదు. పాలిటెక్నిక్ కాలేజీలను రద్దు చేసి.. భూములు స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారు. తెలంగాణలో విద్యార్థులు వారి హక్కుల కోసం పోరాడుతున్నారు. ఇది అంతం కాదు.. ఆరంభం మాత్రమే. విద్యార్థులను రాజకీయంగా వాడుకునే కాన్సెప్ట్‌కు మేం వ్యతిరేకం. వారి ఉద్యమంలోకి మేం వెళ్లం.. నైతికంగానే మద్దతు ఇస్తాం" అని రామచందర్‌రావు తెలిపారు.

## జెన్‌జీ ఉద్యమాలపై కాంగ్రెస్‌కు దిల్లీలో ఒక నీతి..

మొదటిపేజీ తరువాయి

హనుమకొండ: పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. హనుమకొండలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఆయనను కలిసి తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 97 జీవోను రద్దు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యార్థుల ఉద్యమాలు రాహుల్ గాంధీకి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. జెన్‌జీ ఉద్యమాలపై కాంగ్రెస్‌కు దిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి ఏంటని దుయ్యబట్టారు. అంతకుముందు హనుమకొండలోని కలెక్టరేట్ వద్ద టీఎన్జీవోలు నిర్వహించిన ధర్నాలో ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొని మద్దతు తెలిపారు. దీంతో ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేసి సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు.


## గూఢచారులు, స్లీపర్ సెల్స్‌తో.. ఎస్-400 వ్యవస్థను గుర్తించేందుకు పాక్ ప్రయత్నాలు



పాకిస్థాన్ ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. అయితే, ఇందుకు సంబంధించి ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా (రిటైర్డ్) కీలక విషయాలు వెల్లడించారు. ఎస్-400 క్షిపణి వ్యవస్థలను గుర్తించడానికి దాయాది దేశం ఎన్నో ప్రయత్నాలు చేసిందని, ఇందుకోసం భారత్‌లో ఉన్న పాక్ గూఢచారులు, స్లీపర్ సెల్స్‌ను యాక్టివేట్ చేసిందని చెప్పారు.

వాయుసేనలో సుదీర్ఘ కాలం సేవలందించిన మిశ్రా.. ఆపరేషన్ సిందూర్ సమయంలో వెస్టర్న్ ఎయిర్ కమాండ్ చీఫ్‌గా ఉన్నారు. ఇటీవల ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. భారత క్షిపణి వ్యవస్థను అతిపెద్ద ముప్పుగా పాక్ భావించిందన్నారు. వాటిని గుర్తించేందుకు దాయాది దేశం అనేక ప్రయత్నాలు చేసిందని, ఇతర దేశాల నుంచి ఉపగ్రహాల సహాయాన్ని కూడా తీసుకుందని చెప్పారు. భారత్‌లో వాటి స్థావరాలను గుర్తించేందుకు స్లీపర్ సెల్స్‌నూ క్రియాశీలం చేసిందన్నారు.

## లోక్‌సభ స్థానాలు మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలి.. ప్రధాని మోదీకి ఖర్గే లేఖ



నియోజకవర్గాల పునర్విభజన పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి (ౡవీ వీశీఱ) లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని సూచించారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గేడిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు.

# 41వ నేత్రదాన పక్షోత్సవాలు: విద్యార్థుల్లో నేత్రదానం, ఆరోగ్యంపై అవగాహన

- మరణానంతరం నేత్రదానం ద్వారా అంధులకు వెలుగు అందించవచ్చు: డీఎంహెచ్ఓ డా. అంజెలా ఆల్ఫ్రెడ్
- వ్యక్తిగత పరిశుభ్రత పోషకాహారంపై విద్యార్థులకు సూచనలు గీతానగర్ ప్రాథమిక పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహణ



41వ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నేత్రదానం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అంజెలా ఆల్ఫ్రెడ్ మాట్లాడుతూ, మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా అంధులకు చూపును ప్రసాదించే గొప్ప అవకాశం లభిస్తుందని తెలిపారు. నేత్రదానంపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు ప్రతిరోజూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పోషక విలువలు కలిగిన ఆహారం, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలను ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. జంక్ ఫుడ్‌తో పాటు అధిక నూనె, ఉప్పు కలిగిన ఆహారాన్ని తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్లైండ్‌నెస్ కంట్రోల్ ప్రోగ్రామ్ అధికారి నయీమ్ జహా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, మహేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు వేధింపులకు గురైతే నిర్భయంగా పిర్యాదు చేయాలి.

- సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.
- గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన.




జిల్లాలో విద్యార్థుల భద్రతను బలోపేతం చేయడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే గారి ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఈకార్యక్రమల్లో భాగంగా విద్యార్థులకు గుడ్ టచ్,బ్యాడ్ టచ్, పోక్సో చట్టం,సోషల్ మీడియా వినియోగం/మోసాలు,మహిళ చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు ఈసందర్భంగా ఈరోజు ముస్తాబద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అవునూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకి అవగాహన కల్పించి , వేధింపులకు గురైతే వెంటనే నిర్భయంగా షీ టీమ్ నెంబర్ 87126 56425 కు ఫిర్యాదు చేయాలని , నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని షీ టీమ్‌అధికారులు సూచించారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులకు స్పందించకూడదని , గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐలు ప్రమీల,రవి , సిబ్బంది శ్రీలత, ప్రియాంక,శ్రీనివాస్‌తో పాటు పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 21 మందితో మండల కాంగ్రెస్ కమిటీ నియామకం

- ఉత్తర్వులు జారీ చేసిన డీసీసీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్
- పార్టీ కోసం పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు భరోసా:
- మండల అధ్యక్షులు గజ్జెల రాజు

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయి కమిటీని బుధవారం కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ జెండా,ఎజెండా లను ముందుకు తీసుకు వెళు తూ పార్టీ లైన్ దాటకుండా క్రమశిక్షణతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు పార్టీ కోసం పనిచేసే ప్రతీ ఒక్కరికీ గుర్తింపు లభిస్తుందని అన్నారు. ఆశావాహులకు భవిష్యత్తులో అధిష్టానం అండగా ఉంటుందని భరోసానిచ్చారని పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషిచేయాలని తెలుపుతూ నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు ఈ కమిటీకి సహకరించిన జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి మండల అధ్యక్షులు గజ్జల రాజు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. మండల కమిటీ సభ్యులుగా 21మందితో కూడిన నియామకశీ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు యారటి కర్ణాకర్ యాగండ్ల మల్లేష్ ప్రధాన కార్యదర్శులు సారగొండ రామిరెడ్డి,మామిళ్ల ఆంజనేయులు,జంగరాజు, చెరుకు ఎల్లం కార్యదర్శులు గిగ్గిళ్ల శ్రీలత,గంగాధరి రమేష్, సడిమల శంకర్, అనమేని రాజు, ఏనుగంటి కరుణాకర్, కార్యవర్గ సభ్యులు ఓన్నజీపేట హరీష్, పోతారం స్వప్న,మచ్చ కొండయ్య, భూక్య మహేష్,మెరుగు శ్రీనివాస్, కొప్పు భాగ్య, బులి యాదమ్మ,ముక్క శంకరయ్య,పలుపు సుగుణ లను నియమించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు


Email : sangeetham.srinivas.inc@gmail.com / sangeethamsrinivas45@gmail.com
Mobile: 9885216306 8328004425
DISTRICT CONGRESS COMMITTEE
RAJANNA SIRCILLA
Near Konda Laxman Bapuji Circle, Bypass Road, Vidyanagar, Rajanna Sircilla Dist. Head Quarters
SANGEETHAM SRINIVAS
President
Date 25-8-2026

The following names are appointed as MUSTABAD MANDAL Committee

| Sl.No. | Name | Position |
|---|---|---|
| 01 | YARATI KARUNAKAR | Vice president |
| 02 | YAGANDLA MALLESH | Vice president |
| 03 | SARAGONDA RAMREDDY | General Secretary |
| 04 | JANGA RAJU | General Secretary |
| 05 | CHERUKU ELLAM | General Secretary |
| 06 | MAMINDLA ANJANEYULU | General Secretary |
| 07 | GUGGILLA SRILATHA | Secretary |
| 08 | GANGADHARI RAMESH | Secretary |
| 09 | ARUTLA MAHENDAR REDDY | Secretary |
| 10 | SADIMELA SHANKAR | Secretary |
| 11 | ANAMENI RAJU | Secretary |
| 12 | YENUGANTI KARUNAKAR | Secretary |
| 13 | VONNAJIPETA HARISH | Executive Member |
| 14 | POTHARAM SWAPNA | Executive Member |
| 15 | MACHA KONDAIAH | Executive Member |
| 16 | BHUKYA MAHESH | Executive Member |
| 17 | MERUGU SRINIVAS | Executive Member |
| 18 | KOPPU BHAGYA | Executive Member |
| 19 | BOOLI YADAMA | Executive Member |
| 20 | MUKA SHANKARAIHA | Executive Member |
| 21 | PALUPU SUGUNA | Executive Member |

SANGEETHAM SRINIVAS
President

# ముస్తాబాద్ మండలంలో విబి - జి రాంజీ పనుల పరిశీలించిన

- డి ఆర్ డి ఓ,లక్ష్మి నారాయణ , ఎంపీడీవో





ముస్తాబాద్ మండలంలోని మద్దికుంట గ్రామంలో గురువారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీవో)లక్ష్మీనారాయణ, వి బి– జి రాంజీ పథకం కింద చేపడుతున్న ఫారం పాండ్ల పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన డీఆర్‌డీవో రైతులు తమ వ్యవసాయ భూముల్లో ఫారం పాండ్లు (నీటి నిల్వ గుంతలు) తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఫారం పాండ్ల ద్వారా వర్షపు నీటిని భూమిలో నిల్వ చేసుకోవడంతో భూమిలో తేమ శాతం పెరిగి, పంటలకు అవసరమైన నీటి లభ్యత మెరుగుపడి, పంటల దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం గ్రామంలోని కమ్యూనిటీ భూమిలో మొక్కలు నాటే కార్యక్రమంలో డీఆర్‌డీవో పాల్గొని మొక్కలు నాటారు. నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు తదుపరి ముస్తాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో పెన్షన్లకు సంబంధించిన అన్ని దరఖాస్తులను పరిశీలించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం ముస్తాబాద్, గూడెం గ్రామాల్లో ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థుల యూనిఫారాల కుట్టు పనులను డీఆర్‌డీవో క్షేత్రస్థాయిలో పరిశీలించారు యూనిఫారాల కుట్టు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం రవీందర్, ఎంపీడీవో లచ్చాలు, ఏపీవో ఆనందమోహన్, టెక్నికల్ అసిస్టెంట్లు శ్రీనివాస్, సాయి కృష్ణ క్షేత్ర సహాయకులు స్వామి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

# తీజ్ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు

- గిరిజన సంస్కృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: విప్ ఆది శ్రీనివాస్
- నూకలమర్రి గ్రామంలో ఘనంగా తీజ్ పండుగ వేడుకలు



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో నిర్వహించిన తీజ్ పండుగ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు, యువతులతో కలిసి సంప్రదాయ తీజ్ ఉత్సవాల్లో పాల్గొని వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గిరిజనుల ఆచారాలు, సంప్రదాయాలు మరియు సంస్కృతి భారతీయ వారసత్వానికి ప్రతీకలని పేర్కొన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆది శ్రీనివాస్ సూచించారు. ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతి కోసం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. తీజ్ వేడుకల్లో గ్రామ ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు.

# వివేకానంద విద్యానికేతన్ హై స్కూల్‌లో రాఖీ పౌర్ణమి వేడుకల

- "నీవు నాకు రక్ష నేను నీకు రక్ష, మనందరం దేశానికి రక్ష" నినాదాలతో సందడి



స్థానిక అశోక్‌నగర్‌లోని వివేకానంద విద్యానికేతన్ హై స్కూల్లో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికి ఒకరు రాఖీలు కట్టుకుంటూ "నీవు నాకు రక్ష -- నేను నీకు రక్ష, మనందరం దేశానికి రక్ష" అనే నినాదాలతో రాఖీ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. విద్యార్థులు పరస్పరం స్వీట్లు పంచుకుని సోదరభావాన్ని చాటగా, పాఠశాల ఆవరణ పండుగ వాతావరణంతో కళకళలాడింది. ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఐక్యత, ప్రేమాభిమానాలు, పరస్పర గౌరవం వంటి విలువలను పెంపొందించేలా సాగింది. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు, పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, బుచ్చారావు, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలు



కృష్ణవేణి టాలెంట్ స్కూల్, వేములవాడలో రక్షాబంధన్ వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా నిర్వహించారు. ప్రేమ, ఆప్యాయత, సోదరభావం, పరస్పర గౌరవం మరియు బాధ్యత వంటి విలువలను విద్యార్థులకు తెలియజేసేలా వేడుకలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రక్షాబంధన్ పండుగ యొక్క ప్రాధాన్యతను చాటారు. పాఠశాల ప్రాంగణంలో వేడుకలు ఆనందంగా, క్రమశిక్షణతో కొనసాగాయి.డైరెక్టర్ శ్రీ సన్నిధి వెంకట కృష్ణ విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందిస్తూ రక్షాబంధన్ వంటి పండుగలు ప్రేమ, ఐక్యత మరియు అనుబంధాలను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు.ప్రిన్సిపాల్ శ్రీ వెంకటేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, పరస్పరం గౌరవించుకోవడం, ప్రేమను పంచుకోవడం, బాధ్యతాయుతంగా వ్యవహరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారువిద్యార్థుల్లో ప్రేమ, ఐక్యత, సోదరభావం, పరస్పర గౌరవం పెంపొందించే సందేశంతో రక్షాబంధన్ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి.కృష్ణవేణి టాలెంట్ స్కూల్, వేములవాడ

# రాఖీ పండుగతో కిటకిటలాడిన వేములవాడ ఆర్టీసీ బస్టాండ్

**- అన్నయ్య ఢ తమ్ముడు నీకోసం వస్తున్నా... సొంతూర్లకు తరలిన ఆడపడుచులు**

**- రాఖీ పౌర్ణమి వేళ ప్రయాణికులతో నిండిన తిప్పపురం ప్రయాణ ప్రాంగణం**



రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా వేములవాడ ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. అన్నదమ్ములకు రాఖీలు కట్టేందుకు సొంత ఊర్లకు వెళ్లే ఆడపడుచులు పెద్ద సంఖ్యలో బస్టాండ్‌కు చేరుకోవడంతో ప్రయాణ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.లగేజీ సంచులు, చిన్నారులతో కలిసి ప్రయాణికులు తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు బస్టాండ్‌కు పోటెత్తారు. రాఖీ పండుగతో పాటు వరుస సెలవులు రావడంతో ఉదయం నుంచే ప్రయాణికుల రద్దీ భారీగా పెరిగింది.వేములవాడ డిపో అధికారులు అదనపు బస్సులు నడుపుతున్నప్పటికీ, పెరిగిన రద్దీకి అనుగుణంగా వాహనాలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సు ఎక్కేందుకు పోటీ పడుతూ గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.రద్దీని దృష్టిలో ఉంచుకుని మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ప్రజలు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.

# విద్యార్థుల చేతుల మీదుగా రాఖీ తయారీ ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



వీర్నా అయ్యోరుపల్లి పాఠశాలలో రక్షాబంధన్ పండుగను పురస్కరించుకుని విద్యార్థులు స్వయంగా తయారుచేసిన రాఖీలతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఆసక్తి, సృజనాత్మకతతో తయారుచేసిన రాఖీలను కౌన్సిలర్ గుడిసె సంతోష గారు పరిశీలించి, విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ గుడిసె సంతోష గారు విద్యార్థులు, ఉపాధ్యాయులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, స్వయంకృషి, పరస్పర ప్రేమాభిమానాలను పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మూడో వార్డు ఆఫీసర్ రాజు, ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టరు శ్రీ హేమకళ, మంజుల, ప్రధానోపాధ్యాయులు బారాజు రమణరెడ్డి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.విద్యార్థులు స్వయంగా తయారుచేసిన రాఖీలతో నిర్వహించిన ఈ కార్యక్రమం పాఠశాలలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పింది.

# రుద్రంగిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం

## లబ్ధిదారులకు కార్డులు అందజేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు చేరవేయడమే ప్రభుత్వ ధ్యేయం**

**- స్మార్ట్ రేషన్ కార్డులతో పారదర్శకత, వేగవంతమైన సేవలు**

**- ప్రతి పేద కుటుంబానికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం : ఆది శ్రీనివాస్**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గంలోని రుద్రంగి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే శ్రీ ఆది శ్రీనివాస్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని పనిచేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హత కలిగిన కుటుంబాలకు నాణ్యమైన సేవలు, పారదర్శక పంపిణీ వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.గతంలో ఎదురైన అనేక సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారం చూపుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను మరింత విస్తరిస్తూ ప్రతి కుటుంబ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.ప్రజా ప్రభుత్వ హయాంలో పేదలు, రైతులు, మహిళలు, వృద్ధులు సహా అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి కొనసాగుతుందని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

## ప్రేమ, ఆప్యాయత, రక్షణకు ప్రతీకగా రాఖీ పండుగ నిర్వహణ

**- "మనమంతా ఒకే ౠఖూ కుటుంబం"**

**-- కరస్పాండెంట్ పల్లె రాజు రెడ్డి**



సోదర--సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, రక్షణకు ప్రతీకగా నిలిచే పవిత్ర రక్షాబంధన్ పండుగను శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ (ౠఖూ)లో ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టి ప్రేమాభిమానాలను పంచుకుంటూ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.రక్షాబంధన్ కేవలం అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య మాత్రమే ఉండే బంధం కాదని, ప్రేమ, నమ్మకం, బాధ్యత, రక్షణతో ఏర్పడే ప్రతి అనుబంధాన్ని గౌరవించే గొప్ప పండుగ అని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. విద్యార్థుల్లో సోదరభావం, పరస్పర గౌరవం, సహకార స్ఫూర్తి పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పల్లె రాజు రెడ్డి మాట్లాడుతూ, "మనమందరం ఒకే ౠఖూ కుటుంబ సభ్యులం. ఒకరికొకరం తోడుగా నిలబడి ప్రేమ, ఆప్యాయత, బాధ్యతతో ముందుకు సాగాలి. విద్యార్థులు మంచి విలువలను అలవరచుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలి" అని సూచించారు.రంగురంగుల రాఖీలతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనగా, ఉపాధ్యాయులు రక్షాబంధన్ పండుగ విశిష్టతను వివరించి విద్యార్థులకు సందేశాలు అందించారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతంగా నిర్వహించారు.

# తిప్పాపూర్ గోశాలలో ముమ్మర పారిశుధ్య పనులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాలతో రంగంలోకి దిగిన ఆలయ అధికారులు

**- గోవుల ఆరోగ్య పరిరక్షణకు క్వారంటైన్ షెడ్లు, వెటర్నరీ సేవల ఏర్పాటు**

**- ఏడాది లోపు లేగ దూడలను సమర్పించవద్దని ఆలయ ఈఓ విజ్ఞప్తి**



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన తిప్పాపూర్ గోశాలలో పారిశుధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఇటీవల గోశాలను సందర్శించి పరిశుభ్రతను మెరుగుపరచాలని, గోవుల సంరక్షణలో ఎలాంటి లోటుపాట్లు రానివ్వద్దని అధికారులను ఆదేశించారు.ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆలయ ఈఓ రమాదేవి పర్యవేక్షణలో దేవస్థాన సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. వర్షాల కారణంగా గోశాలలో పేరుకుపోయిన బురద, నిల్వ ఉన్న పేడను జేసీబీలు, టిప్పర్ల సహాయంతో పూర్తిగా తొలగిస్తున్నారు. కోడెలు సంచరించే ప్రాంతాల్లో బురద సమస్య తలెత్తకుండా మురం వేస్తున్నారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పశు సంవర్ధక శాఖ, వెటర్నరీ సిబ్బంది గోవులకు నిరంతర వైద్య సేవలు అందిస్తున్నారు. గోశాలకు శాశ్వత ప్రాతిపదికన ఒక వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌ను నియమించేందుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలిపారు.అనారోగ్య లక్షణాలు ఉన్న కోడెలను ఇతర గోవుల నుంచి వేరు చేసి క్వారంటైన్ షెడ్లలో ఉంచి ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. గోవుల పరిరక్షణ, గోశాల పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆలయ అధికారులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆలయ ఈఓ రమాదేవి భక్తులకు విజ్ఞప్తి చేస్తూ, ఒక సంవత్సరం లోపు ఉన్న లేదా పాలు మరవని లేగ దూడలను గోశాలకు సమర్పించవద్దని కోరారు. అలాగే దేశవాళీ కోడెలను మాత్రమే సమర్పించాలని సూచించారు.

# రక్షాబంధన్ వేడుకల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన.



సిరిసిల్ల ట్రాఫిక్ పోలీసులు నేతాజీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రక్షాబంధన్ వేడుకల్లో విద్యార్థులతో కలిసి పాల్గొని, రహదారి భద్రత మరియు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.ఈసందర్భంగా ట్రాఫిక్ ఆర్.ఎస్.ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ..హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్ట్ వినియోగించడం, వేగంగా మరియు రాంగ్ రూట్ లో వాహనాలు నడపకపోవడం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించకపోవడం, మైనర్ డ్రైవింగ్ చేయకపోవడం , మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం వంటి ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించడంతో పాటు తమ కుటుంబ సభ్యుల భద్రతను కూడా కాపాడుకోవచ్చని సూచించారు.రక్షాబంధన్ సందర్భంగా సోదర--సోదరీమణుల అనుబంధంతో పాటు రోడ్డు భద్రత పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అక్కచెల్లెళ్ళు రక్ష బంధన్ సందర్భంగా అన్నతమ్ముళ్లకు హెల్మెట్ బహుమతి ఇచ్చి వాహనం నడిపే సమయల్లో హెల్మెట్ ధరించేలా చూడాలని పిలుపునిచ్చారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ డిమాండ్

**- సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్‌కు వినతిపత్రం సమర్పణ**
**- సమస్యలు తీర్చకుంటే పనులు బంద్: సీఐటీయూ హెచ్చరిక**
**- కౌన్సిల్ సమావేశంలో కార్మికుల అజెండా పెట్టాలి: కోడం రమణ**





సిరిసిల్ల మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను రాబోయే కౌన్సిల్ సమావేశంలో అజెండాగా చేర్చి తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పనులు బంద్ చేసి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా-చక్రపాణిలను కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోడం రమణ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు శ్రమిస్తున్న కార్మికుల సమస్యలను అధికారులు, పాలకవర్గం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. కార్మికులకు అందించాల్సిన యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనెలు, గ్లౌజులు వెంటనే పంపిణీ చేయాలన్నారు. 60 ఏళ్లు నిండిన వారు, మరణించిన కార్మికుల స్థానాల్లో వారి కుటుంబ సభ్యులకే ప్రాధాన్యం ఇస్తూ కొత్త వారిని పనిలోకి తీసుకోవాలని, లేకపోతే ఉన్న కార్మికులపై తీవ్ర పనిభారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే 2009-2012 మధ్య కాలానికి సంబంధించిన పెండింగ్ పీఎఫ్ సొమ్మును ఖాతాల్లో జమ చేయాలని, అందరికీ ఈఎస్ఐ సదుపాయంతో పాటు ఐడెంటిటీ కార్డులు జారీ చేయాలని కోరారు. రాబోయే కౌన్సిల్ భేటీలో కార్మికుల సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కాసర్ల శంకర్, పట్టణ అధ్యక్షుడు ఏల్పుల బాలయ్య, నాయకులు నర్మెట బాబా కిషన్, బత్తుల దేవరాజు, గడ్డం విజయ, నర్మెట ఉమ, రెడ్డిమల్ల మమత, మారుపాక లక్ష్మి, నక్క ఎల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

# భూముల రీ సర్వే వివరాలు పక్కాగా నమోదు చేయాలి

**- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**
**- ఇల్లంతకుంట మండలం సిరికొండలో భూ భారతి కింద భూముల రీ సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్**



భూ భారతి కింద భూముల రీ సర్వే వివరాలు పక్కాగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. ఇల్లంతకుంట మండలం సిరికొండ గ్రామంలో భూ భారతి కింద రోవర్ యంత్రంతో భూముల రీ సర్వే పనులు కొనసాగుతుండగా, గురువారం అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, అటవీ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. సర్వే వివరాలు ఎలా తీసుకుంటారో పరిశీలించి.. అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో భూ భారతి కింద భూముల రీ సర్వే పనులు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో సర్వే పై రైతులకు ముందుగా సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, తహసీల్దార్ సురేష్ అధికారులు సిబ్బంది ఉన్నారు.

# కుటుంబంపై దాడికి తెగబడ్డ నలుగురిపై కేసు

**- సారంపల్లి పెట్రోల్ పంప్ వద్ద ఘటన**
**- బాధితులకు తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు**
**- తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**

ఆటోలో వెళ్తున్న ఒకే కుటుంబానికి చెందిన సభ్యులపై నలుగురు యువకులు బూతులు తిడుతూ, బండరాళ్లతో తీవ్రంగా దాడి చేసిన సంఘటన తంగళ్లపల్లి మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... దేశాయిపల్లి గ్రామానికి చెందిన కంకణాల రాజు తన భార్య లత, కుమారుడు అక్షిత్, తమ్ముడు తిరుపతి, మరదలు చామంతితో కలిసి బుధవారం రాత్రి సిరిసిల్ల నుండి స్వగ్రామానికి ఆటో (టూ-15-ంజ-6178) లో బయలుదేరారు. రాత్రి సుమారు 9:30 గంటల ప్రాంతంలో సారంపల్లి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ వద్ద డీజిల్ కొట్టించుకుని వెళ్తుండగా, మోటార్ సైకిల్ (టూ-21-నా-2859) పై అతివేగంగా వచ్చిన ముగ్గురు యువకులు ఆటోను ప్రమాదకరంగా కట్ కొట్టారు.

దీనిని రాజు ప్రశ్నించగా ఆగ్రహించిన సదరు యువకులు ఆటోను అడ్డగించి గొడవకు దిగారు. కంకణాల రాజుపై బూతులు తిడుతూ పిడికిళ్లతో దాడి చేయగా, అడ్డుకోబోయిన ఆయన కుటుంబ సభ్యులపై కూడా దాడికి పాల్పడ్డారు. అంతలోనే మరికొంత మంది యువకులు అక్కడకు చేరుకుని బాధితులను చేతులతో, బండరాళ్లతో తీవ్రంగా కొట్టి చంపుతామని బెదిరింపులకు దిగారు. ఈ గొడవను అడ్డుకునేందుకు యత్నించిన స్థానికులు సిరిసిల్ల ప్రశాంత్, సిరిసిల్ల నరేష్‌లపై కూడా సదరు యువకులు దాడికి తెగబడ్డారు. గమనించిన స్థానికులు కిషన్, నవీన్, అశోక్ వెంటనే స్పందించి బాధితులను కాపాడటంతో



నిందితులు అక్కడి నుండి పారిపోయారు. ఈ దాడిలో గాయపడిన బాధితులు సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. బాధితుడు కంకణాల రాజు ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వేముల ఆదిత్య, రంగు భరత్, రంగు తిలక్, ఎర్ర హరి కుమార్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. నిందితులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

# తంగళ్లపల్లిలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

**- అన్నాచెల్లెళ్ల ప్రేమ, అనుబంధాలకు ప్రతీక రాఖీ పండుగ: శ్రీనివాస్ యాదవ్**



తంగళ్లపల్లి మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శుభోదయ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరస్పరం రాఖీలు కట్టుకుని పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్ ఎం. శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, రక్షణ భావాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. అక్క తన తమ్ముడికి రాఖీ కట్టి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆశీర్వదిస్తుందని, తమ్ముడు తన అక్కకు కానుకలు అందించి ప్రేమాభిమానాలను వ్యక్తం చేస్తాడని తెలిపారు. పండుగలు కేవలం ఆనందం కోసమే కాకుండా కుటుంబ బంధాలను బలోపేతం చేయడానికి, పరస్పర బాధ్యతలను గుర్తు చేయడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే కుటుంబ విలువలు, సోదరభావం, పరస్పర గౌరవం వంటి మంచి లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు రాఖీ పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం. శ్రీనివాస్ యాదవ్‌తో పాటు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రకృతి పరిరక్షణలో..హై రేంజ్ ప్రపంచ రికార్డును సాధించిన చిన్నారి ప్రకృతి బ్లెస్సిని శాలువాతో అభినందించిన ప్రభుత్వ విప్

ప్రకృతి పర్యావరణ పరిరక్షణ కోసం విశేష కృషి చేస్తూ "ఐ రేంజ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్" (× =ఖఅస్త్రవ ఔశీతీశ్రీ౭ దీశీశీ౫ శీట =వఔశీతీ౭ం) సాధించిన చిన్నారి ప్రకృతి బ్లెస్సిని వేములవాడ శాసన సభ్యులు ప్రభుత్వ విప్ ఆది ఆది శ్రీనివాస్ బుధవారం తన క్యాంపు ఆవరణంలో శాలువాతో సత్కరించి అభినందించారు. చిన్న వయసులోనే పర్యావరణ పరిరక్షణపై అపారమైన అవగాహన పెంచుకుని, సమాజంలో చైతన్యం తెచ్చేందుకు ప్రకృతి బ్లెస్సి చేస్తున్న సేవలు ఎందరికో ఆదర్శనీయమని , బ్లెస్సి మూడవ సంవత్సరం నుండి ప్రకృతి సంరక్షణ కోసం విత్తనాలను సేకరించి విత్తన బంతులను చేసి అడవుల్లోకి వెళ్లి విత్తనాలను చల్లడం అతి చిన్న వయసులో ప్రాణవాయువును ఇచ్చే ప్రకృతికే ప్రాణం పోస్తున్న చిన్నారి ప్రకృతి బ్లెస్సి సిరిసిల్ల జిల్లా ఆణిముత్యం అని తాను అడవుల్లో నాటుతున్న విత్తు ,భావితరాలకు భవిష్యత్తు అని ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్ చిన్నారి బ్లెస్సిని కొనియాడారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు, వాతావరణం అందించాలంటే ప్రతి ఒక్కరూ చెట్లను నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఉందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్నారి ప్రకృతి బ్లెస్సిని శాలువాతో సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ప్రకృతిపై ఈ చిన్నారి చూపుతున్న ప్రేమ, చేస్తున్న కృషి సమాజంలో ప్రశంసనీయమని, మున్ముందు ఇలాంటి మరెన్నో అంతర్జాతీయ పురస్కారాలు



పొందాలని , ప్రకృతి సంరక్షణతో పాటు చదువులోను ముందుండాలని , నీవు చేస్తున్న కృషికి చదువుతో భవిష్యత్తులో మంచి ఫలితం దక్కుతుందని, వారు ఆకాంక్షించారు.

# రుద్రవరంలో అంగన్వాడీ సర్టిఫికేట్ల పరిశీలన

**- అంగన్వాడీ పత్రాల తనిఖీ చేపట్టిన జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం**



వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో అంగన్వాడీ సర్టిఫికేట్ల పరిశీలన కార్యక్రమం గురువారం నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, సిడి పిఓ సౌందర్య పర్యవేక్షణలో అభ్యర్థుల పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అంజమ్మ, శశికిరణ్‌లతో పాటు స్థానిక సర్పంచ్ ఊరడి సునీత రాజిరెడ్డి, ఉప సర్పంచ్ బెజగం మహేష్ పాల్గొని సహాయ సహకారాలు అందించారు. అర్హులైన అభ్యర్థుల ఎంపిక పారదర్శకంగా జరిగేలా అధికారులు అన్ని రకాల ధృవీకరణ పత్రాలను నిశితంగా పరిశీలించారు.

# విద్యార్థులు వేధింపులకు గురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయాలి.

**- సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.**
**- 8712656425,నెంబర్ కు ఫిర్యాదు చేయాలి**

విద్యార్థినిల గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు అవగాహన. జిల్లాలో విద్యార్థుల భద్రతను బలోపేతం చేయడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఈకార్యక్రమల్లో భాగంగా విద్యార్థులకు గుడ్ టచ్,బ్యాడ్ టచ్,



పోక్సో చట్టం,సోషల్ మీడియా వినియోగం మోసాలు,మహిళ చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు ఈసందర్భంగా ఈరోజు ముస్తాబద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అవునూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకి అవగాహన కల్పించి , వేధింపులకు గురైతే వెంటనే నిర్భయంగా షీ టీమ్ నెంబర్ 87126 56425 కు ఫిర్యాదు చేయాలని , నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని షీ టీమ్ అధికారులు సూచించారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులకు స్పందించకూడదని,గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐలు ప్రమీల,రవి , సిబ్బంది శ్రీలత, ప్రియాంక,శ్రీనివాస్‌తో పాటు పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

# మండల స్థాయి క్రీడల పోటీలు ఎస్ జి ఎఫ్ ఐ 2026

జెడ్పిహెచ్ఎస్ నామాపూర్




రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల ఎం ఈ ఓ కార్యాలయంలో మండల విద్యాధికారి అంబటి రవీందర్ అధ్యక్షతన అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులకు ఈ రోజు సమావేశం నిర్వహించడం జరిగింది. ఇట్టి సమావేశం లో ఎస్ జి ఎఫ్ ఐ -2026 మండల స్థాయి పోటీలను తేదీ 01/09/2026 నుండి 03/09/2026 వరకు జిల్లా పరిషత్ హై స్కూల్ నామపూర్ పాఠశాల ఆవరణలో నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది...తేదీ 01/09/2026 రోజున ఖ/14,ఖ/17 బాలికలకు కబడ్డీ ఖో ఖో మరియు వాలీబాల్ ,02/09/2026 రోజున ఖ/14...ఖ/17 బాలురకు కబడ్డీ,ఖో ఖో మరియు వాలీబాల్ మరియు03/09/2026 రోజున ఖ/14..ఖ/17 బాలబాలికలకు అథ్లెటిక్స్ నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది..ఏజ్ క్రిటీరియా ఖ/14 ఆటలకు 01/01/2013 తేది తర్వాత జన్మించిన బాల బాలికలకు మాత్రమే...ఖ/17 ఆటలకులి 01/01/2010 తేదీ తర్వాత జన్మించిన బాల బాలికలకు మాత్రమే అవకాశం ఇవ్వబడును. ఈ కార్యక్రమంలో మండల ఎస్ జి ఎఫ్ కన్వీనర్ బి అనిల్ గౌడ్, మరియు వివిధ పాఠశాలల వ్యాయమ ఉపాధ్యాయులు పరశురాములు,శ్రీనివాస్, రాజశేఖర్, శ్యాంసుందర్, గోపి,ఆశిష్ మరియు రాజేందర్ లు పాల్గొనడం జరిగింది

# ఘనంగా అంతంపల్లి (పి.ఏ.సి.ఎస్.) నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం..





**-రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**
**-ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్**

కామారెడ్డి నియోజకవర్గంలోని అంతంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పి.ఏ.సి.ఎస్.) నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా (పి.ఏ.సి.ఎస్.) నూతన చైర్మన్‌గా చిట్టెడి సుధాకర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయగా, నూతన పాలకవర్గ సభ్యులు కూడా ప్రమాణం చేసి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతులు ఆర్థికంగా బలోపేతమైతేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన పంట రుణాలు, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సేవలు సకాలంలో అందించడంలో (పి.ఏ.సి.ఎస్.) లు కీలక పాత్ర పోషించాలని సూచించారు. (పి.ఏ.సి.ఎస్.)లు కేవలం రుణాలు అందించే సంస్థలుగా కాకుండా రైతుల సమగ్ర అభివృద్ధికి తోడ్పడే కేంద్రాలుగా పనిచేయాలని ఆకాంక్షించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రైతు భరోసా, పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్, రైతు బీమా, సాగునీటి వనరుల అభివృద్ధి వంటి కార్యక్రమాలను అమలు చేస్తోందని షబ్బీర్ అలీ తెలిపారు. రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు, మౌలిక వసతులు కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని వేగవంతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నూతన (పి.ఏ.సి.ఎస్.) చైర్మన్ చిట్టెడి సుధాకర్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించిన షబ్బీర్ అలీ, రైతులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి రైతుకు సమానంగా సేవలందిస్తూ (పి.ఏ.సి.ఎస్.) ను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు నూతన పాలకవర్గం సమష్టిగా కృషి చేయాలని కోరారు. అంతంపల్లి, లక్ష్మీదేవునిపల్లి తదితర గ్రామాల రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కామారెడ్డి నియోజకవర్గంలో గ్రామీణ మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం తదితర రంగాలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమంతో పాటు గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తూ అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి చేరేలా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, అంతంపల్లి సర్పంచ్ మంజుల సంజీవరెడ్డి, లింగారెడ్డి, బిక్కనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, తిప్పాపూర్ సొసైటీ చైర్మన్ భీంరెడ్డి, కామారెడ్డి సొసైటీ చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, చుక్కాపూర్ లక్ష్మీనర్సింహ ఆలయ చైర్మన్ కమలాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోనె శ్రీనివాస్, సుదర్శన్, కౌన్సిలర్ మోతిలాల్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు భూమని బాలరాజ్, తాటిపాముల లింబాద్రి, డీసీసీ ఉపాధ్యక్షులు గంప ప్రసాద్, ప్రవీణ్ రెడ్డి, శ్రీకాంత్, యాదవ రెడ్డి, కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్ తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు. అనంతరం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు కార్డులను అందజేశారు.

# రాఖీ పండుగ వేళ సిరిసిల్ల జిల్లాలో విషాదం.. ఫిట్స్‌తో ఐదేళ్ల బాలుడు మృతి

**-"తమ్ముడూ.. లేవ్వురా": బీరప్ప తండాలో అక్కల ఆర్తనాదాలు**
**- కళ్లముందే తమ్ముడు అనంత లోకాలకు..**
**జీర్ణించుకోలేకపోతున్న కుటుంబ సభ్యులు**



సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం బంజేరు గ్రామం బీరప్ప తండాలో గురువారం తెల్లవారుజామున గుండెలు పిండేసే తీవ్ర విషాద సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బట్టు రమేష్, రజిత దంపతుల ఐదేళ్ల కుమారుడు ఈశ్వర్ ప్రసాద్ కు అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో ప్రాణాలు కోల్పోయాడు. కళ్ల ముందే ఆడుతూ పాడుతూ తిరిగిన పసికందు ఒక్కసారిగా అనంత లోకాలకు వెళ్లడంతో ఆ తల్లిదండ్రుల గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. తెల్లవారుజామున నిద్రలోనే చిన్నారికి తీవ్రస్థాయిలో ఫిట్స్ రావడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెంటనే ఆటోలో ఆస్పత్రికి తరలించేందుకు పరుగులు తీశారు. అయితే కాలం కలసిరాక, మార్గమధ్యంలోనే ఆ చిన్నారి కన్నుమూశాడని స్థానికులు తెలిపారు. రేపే రాఖీ పౌర్ణమి కావడంతో తమ ముద్దుల తమ్ముడికి ఎంతో ఆప్యాయంగా రాఖీ కట్టి మురిసిపోవాలని ఆ ఇద్దరు అక్కలు ఆశగా ఎదురుచూశారు. కానీ, ఇంతలోనే కాలయముడు ఫిట్స్ రూపంలో వచ్చి తమ తమ్ముడిని లాక్కెళ్లడంతో ఆ అక్కలకు జీవితంలో ఎన్నటికీ మరచిపోలేని తీవ్ర గుండెకోత మిగిలింది. తమ తమ్ముడు ఇక లేడనే చేదు నిజాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. మృతదేహంపై పడి "తమ్ముడూ.. లేవ్వురా.." అంటూ వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న దృశ్యం బీరప్ప తండా వాసులను తీవ్రంగా కలిచివేసింది.

# విద్యార్థుల చేతుల మీదుగా రాఖీల తయారీ - పాఠశాలలో ఘనంగా రాఖీ సంబరాలు



వీర్నపల్లి మండల కేంద్రంలోని పీఎం శ్రీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసేలా రాఖీ పండుగను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా వివిధ రకాల రాఖీలను ఎంతో ఆసక్తి, సృజనాత్మకతతో తయారు చేశారు. విద్యార్థులు తయారు చేసిన రాఖీలను పాఠశాల ప్రాంగణంలో తల్లిదండ్రులు, గ్రామస్థులకు ప్రదర్శించారు. విద్యార్థులు స్వయంగా తమ రాఖీల ప్రత్యేకతలను వివరిస్తూ, వాటిని తల్లిదండ్రులు, గ్రామస్థులకు అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, స్వయం ఉపాధి ఆలోచన, వ్యాపార నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసంవంటి లక్షణాలు పెంపొందించేందుకు అవకాశం కలిగిందని మండల విద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. అనంతరం పాఠశాలలో రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పరస్పరం రాఖీలు కట్టుకోవడం జరిగింది. సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, రక్షణ వంటి విలువలను గురించి ప్రధానోపాధ్యాయురాలు రజిత విద్యార్థులకు వివరించారు.

# నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**- పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..**
**- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్**



అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలోని మాచారెడ్డి మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అధికారులతో కలిసి షబ్బీర్ అలీ అర్హులైన పేద కుటుంబాలకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో దాదాపు 15 సంవత్సరాలుగా అనేక మంది అర్హులైన పేద కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు అందక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. రేషన్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నిత్యావసర సరుకుల సబ్సిడీతో పాటు ఇతర సంక్షేమ ప్రయోజనాలను పొందడంలో పేద కుటుంబాలు ఇబ్బందులు పడ్డాయని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డు అందించాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం నూతన స్మార్ట్ రేషన్ కార్డుల జారీ ప్రక్రియను చేపట్టిందని షబ్బీర్ అలీ తెలిపారు. అర్హత కలిగిన ఏ కుటుంబం కూడా ప్రభుత్వ సంక్షేమానికి దూరం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నూతన రేషన్ కార్డు ద్వారా కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ కింద సబ్సిడీపై బియ్యం వంటి నిత్యావసర సరుకులు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. రేషన్ కార్డు అనేక సంక్షేమ పథకాలకు అర్హతను నిర్ధారించే ముఖ్యమైన పత్రంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలను అర్హులకు చేరవేయడంలో రేషన్ కార్డులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తూనే మరోవైపు రాష్ట్రంలో మౌలిక వసతులు, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తోందని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. మహాలక్ష్మి, ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రైతు రుణమాఫీ, కళ్యాణమస్తు--షాదీ ముబారక్ వంటి సంక్షేమ కార్యక్రమాల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత ఇల్లు లేని పేద కుటుంబాలకు గృహ సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు, కార్మికులు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. కామారెడ్డి నియోజకవర్గంలో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని షబ్బీర్ అలీ తెలిపారు. ప్రభుత్వ పథకాలు కాగితాలకే పరిమితం కాకుండా చివరి అర్హుడి వరకు చేరాలని అన్నారు. పేద కుటుంబాల ముఖాల్లో చిరునవ్వు తీసుకురావడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్నామని షబ్బీర్ అలీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ప్రభుత్వ అధికారులు, మాచారెడ్డి మాజీ ఎంపీపీ సురేష్ నర్సింగరావు, కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, మాచారెడ్డి సర్పంచ్ సంతోష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బాలరాజు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి నాయక్, భిక్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, తిప్పాపూర్ సొసైటీ చైర్మన్ భీంరెడ్డి, కామారెడ్డి సొసైటీ చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి, చుక్కాపూర్ లక్ష్మీ నరసింహ ఆలయ చైర్మన్ కమలాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్, కౌన్సిలర్ మోతిలాల్, డీసీసీ ఉపాధ్యక్షుడు గంప ప్రసాద్, కామారెడ్డి పట్టణ అధ్యక్షుడు సందీప్, మాజీ సొసైటీ చైర్మన్లు పూల్ చంద్, స్వామిగౌడ్, రాజమౌళి, సత్యనారాయణ, బాలరాజుగౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.